క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

రొద్దం: మండల పరిధిలోని చోళేమర్రి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

'పురం' రూరల్ ఎస్‌ఐగా అబ్దుల్ కలాం


అబ్దుల్ కలాం

హిందూపురం అర్బన్: రూరల్ మండల ఎస్‌ఐగా అబ్దుల్ కలాం ఆజాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన పట్టణంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం ఆజాద్ మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. అక్రమ మద్యం, పేకాట వంటి వాటి నిర్మూలనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎస్పీ కంజాక్షన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

లేపాక్షి సర్పంచ్‌కు సన్మానం


సర్పంచ్ ఆదినారాయణను సన్మానిస్తున్న అధికారులు, కార్మికులు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి గ్రామ సచివాలయంలో సోమవారం ఉదయం గ్రామ సచివాలయం సిబ్బంది, పారిశుధ్య కార్మికులు సర్పంచ్ ఆదినారాయణను ఘనంగా సన్మానించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా దేశంలో లేపాక్షి ఉత్తమ గ్రామంగా ఎంపికైన నేపథ్యంలో సర్పంచ్ అవార్డు తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే స్వచ్ఛ భారత్ సేవా కార్యక్రమంలో ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

'పురం'లో స్వచ్ఛ భారత్


కాలువ శుభ్రం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, ప్రజాప్రతినిధులు

హిందూపురం: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక పట్టణంలోని రహమత్‌పురం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ ఆఫీసు నుంచి రహమత్‌పురం ప్రాంతం వరకు ర్యాలీగా తరలివెళ్లి పెద్దకాలువలతో పాటు రోడ్లును శుభ్రం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ ముఖ్యంగా పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించివేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఇలియాజ్, ఏ, బి బ్లాక్ కన్వీనర్లు సాదిక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ

అగళి: మండల పరిధిలోని ఆలుడి సచివాలయంలో ఆలుడి గ్రామ సర్పంచ్ బసవరాజు, కొమరేపల్లి సర్పంచ్ సుజాత ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనుల ఎంపికపై చర్చించారు. అంతకుముందు గాంధీ జయంతి సందర్భంగా మహాత్మునికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నింగమ్మ, పంచాయతీ కార్యదర్శి అశోక, వీఆర్‌ఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దొంగ అనుకొని వ్యక్తిపై దాడి

సోమందేపల్లి: దొంగ అన్న అనుమానంతో ఓ వ్యక్తిని స్థానికులు చితకబాదిన ఘటన మండలంలోని కేతగానిచెరువు సమీపంలో సోమవారం జరిగింది. కోళ్ల ఫారంలోకి దొంగ చొరబడ్డాడన్న అనుమానంతో పెనుకొండ మండలం నాగలూరుకు చెందిన వ్యక్తిని స్థానికులు కొట్టారు. బెంగళూరులో కూలి పనిచేసుకుంటూ ఉండేవాడని, దండుగులు డబ్బు లాక్కెళ్లడంతో బస్సులేక నడుచుకొని స్వగ్రామానికి వెళ్తున్నట్లు బాధితుడు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి


అలంకరణలో శ్రీనివాసనగర్ గణపతి

హిందూపురం: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని సోమ వారం వినాయక ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసనగర్, బెంగళూరు రోడ్‌లోని గణపతి ఆలయంలో ఉదయం, సాయంత్రం విశేష పుష్పాలంకరణ, గరకతో పాటు కుడుముల హారలు ఆకుల తోరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

మహాత్మునికి ఘన నివాళి

- వాడ వాడలా బాపూజీ జయంతి
- గాంధీజీ బాటలో పయనించాలని వక్తల పిలుపు
- జగనన్నతో గ్రామ స్వరాజ్యం సాకారమైందన్న ప్రజాప్రతినిధులు


మడకశిర: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి


పెనుకొండ: క్యాంప్ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ


హిందూపురం: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో సోమవారం మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చేసిన పోరాటాన్ని వక్తలు వివరించారు. మహాత్ముని బాటలో యువత పయణించాలని సూచించారు.

బాపూజీ అడుగుజాడల్లో నడవాలి

మడకశిర: ప్రతి ఒక్కరూ బాపూజీ అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. సోమవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ అహింసా మార్గంలో నడిచి ప్రశాంతతను కాపాడాలని కోరారు. దేశానికి సాతంత్ర్యం తీసుకువరావడానికి గాంధీ అహింసా మార్గంలో పోరాటం చేశారని గుర్తు చేశారు. మరోవైపు ఆర్యవైశ్యులు కూడా పట్టణంలో గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. డీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు హనుమంతు ఆధ్వర్యంలో కూడా గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, డైరెక్టర్ నాగరాజు, సింగల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, వైస్ ఎంపీపీ మూర్తి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంటకలక్ష్మమ్మ, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప పాల్గొన్నారు.

జాతిపిత స్ఫూర్తితో జగనన్న పాలన

పెనుకొండ: జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ అహింసనే ఆయుధంగా చేసుకుని బ్రిటీష్ పాలకులను దేశం నుంచి తరిమికొట్టేందుకు గాంధీ మహాత్ముడు చేసిన శాంతి పోరాటం భావితరాలకు ఆదర్శనీయమన్నారు. ప్రతి ఒక్కరూ మహాత్ముని అడుగుజాడల్లో నడవాలన్నారు. దేశానికి సైనికులు, రైతుల గొప్పతనాన్ని చాటి చెప్పిన లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద కూడా పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూఖ్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతో సాకారం

హిందూపురం: మహాత్మాగాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. గాంధీ, లాల్‌బహదుర్‌శాస్త్రి జయంతి సందర్భంగా గాంధీ సర్కిల్ వద్ద మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి లాల్‌బహుదూర్‌శాస్త్రి స్మరిస్తూ నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. దీపిక మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికాభాను, డిష్ చాంద్, నారాయణస్వామి, ఆర్‌కె ఖలీల్, ఫారుక్, మాజీ ముత్తవల్లి తల్హాఖాన్, అన్సర్, రియాజ్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో గాంధీ జయంతి

పెనుకొండ: పట్టణంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులు శంకరప్ప, ముజీబ్ పసల సయ్యద్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, న్యాయవాదులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు ఆయన చేసిన శాంతి పోరాటాన్ని కొనియాడారు. అదేవిధంగా దేశ మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద కూడా నివాళులర్పించారు.

మహాత్ముడి స్ఫూర్తితో ముందుకెళ్దాం

హిందూపురం అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో ముందుకు వెళదామని అదనపు జిల్లా జడ్జి కంపల్లి శైలజ పిలుపునిచ్చారు. ఆమె గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని కోర్టు ఆవరణలో గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే సబ్ జైలులో జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖైదీలు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని గాంధీజీ చూపించిన అహింసామార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఆనందరావు, న్యాయవాదులు సుదర్శన్, కళావతి, సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.


చిలమత్తూరు: గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ నరేష్‌కృష్ణ


పెనుకొండ రూరల్: గాంధీ జయంతి సందర్భంగా కురుబవాండ్లపల్లిలో గ్రామసభ ...


గుడిబండ: గాంధీజీకి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


లేపాక్షి: కల్లూరు సచివాలయంలో గాంధీ జయంతి ..


రొద్దం: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ చంద్రశేఖర్ తదితరులు


అమరాపురం: గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఈరన్న తదితరులు


గోరంట్ల: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ ప్రమీల ఆధ్వర్యంలో...


హిందూపురం: కోర్టు ఆవరణను శుభ్రం చేస్తున్న అదనపు జిల్లా జడ్జి శైలజ


పెనుకొండ: కోర్టు ఆవరణలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న న్యాయమూర్తులు


హిందూపురం: మహాత్మునికి నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు


పరిగి: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సవిత, సర్పంచ్ లక్ష్మీదేవి తదితరులు

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా మురళీధర్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న ఎన్వీ మురళీధర్‌బాబు

పరిగి: మండలంలోని ఏపీఆర్ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు దక్కింది. గుంటూరులోని ఏపీ రెసిడెన్సియల్ ఎడ్యూకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో దశాబ్దాల కాలం పని చేసిన వి శ్రీనివాసరావు జ్ఞాపకార్థంతో ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులచే వీఎస్సార్ ఫౌండేషన్ పేరుతో అవార్డులు ఇస్తున్నారు. ఇందులో భాగంగా గుంటూరులోని కలెక్టర్ ఆఫీస్ ప్రాంగణం రెవెన్యూ భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల కొడిగెనహళ్లి ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు అవార్డును అందుకున్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు, గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి నరసింహారావు, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణమోహన్ అవార్డునందించారు.

సీఎస్ జవహర్‌రెడ్డికి వినతులు


వినతిపత్రం అందిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి


సీఎస్ జవహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి

మడకశిర: జిల్లాలో ఉద్యాన (మామిడి) చిరుధాన్యాల పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం మడకశిరకు వచ్చిన సీఎస్ జవహర్‌రెడ్డికి జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి వినతిపత్రం అందించారు. జిల్లా కరువుకు నిలయమని, ఈ నేపథ్యంలో భూగర్భజలాలను నమ్ముకుని వ్యవసాయం, ఉద్యాన పంటలను రైతులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని వివరించారు. చిరుధాన్యాల పంటలు కూడా పెద్ద ఎత్తున సాగు అవుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయం, ఉద్యాన పంటల సాగు పద్ధతిలో మేలైన యాజమాన్య పద్ధతులు, వంగడాల అభివృద్ధికి, ఉద్యాన, చిరుధాన్యాల పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. సీఎస్ కూడా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

రైతు సమస్యలపై వినతి

ఉమ్మడి అనంతపురం జిల్లా జలసాధన సమితి నాయకులు సోమవారం మడకశిరకు వచ్చిన సీఎస్ జవహర్‌రెడ్డికి రైతు సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. హంద్రీనీవా ప్రధాన కాలువను వెడల్పు చేయాలని, మడకశిర బ్రాంచ్ కెనాల్ సామర్థ్యాన్ని పెంచాలని అగళి, అమరాపురం మండలాలకు వెళ్లే హంద్రీ నీవా కాలువ పనులకు రూ.93 కోట్లు కేటాయించాలన్నారు. జల సాధన సమితి నాయకులు శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, సోమ్‌కుమార్, నర్సేగౌడు, నవీన్, రామకృష్ణారెడ్డి తదితరులు వినతి పత్రాన్ని అందించారు.

మడకశిరరూరల్: మడకశిరకు వచ్చిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి మర్యద పూర్వకంగా కలిశారు. రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి రుణాలు మంజూరు చేయాలని, రెడ్డి కులస్తులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను, రెడ్డి కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

బంకులో చోరీ

రొళ్ల: పట్టణ సమీపంలోని మడకశిర ప్రధాన రోడ్డుని మంజునాథ్ చెందిన బంకులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడి వివరాలమేరకు.. బంకులో ఉన్న రూ.4 వేల నగదుతో పాటు అమ్మకానికి ఉంచిన వస్తువులు, హుండీ, గ్యాస్ స్టవ్, గ్యాస్ సిలిండర్‌ను దొంగలు అపహకరించుకెళ్లారన్నారు. గతంలోనే ఒకసారి చోరీ జరిగిందని, ఇప్పుడు మరోసారి దొంగతనం జరగడంతో నష్టపోయానని వాపోయారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుర్రపుకొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కెఎం సత్యనారాయణరావు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్నారు. దీంతో ఆయన స్నేహితులు, ఉపాధ్యాయులు సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో సత్యనారాయణ రావుని సన్మానించారు. కార్యక్రమంలో రాజారావు, ఉమేష్, వేదాచలం, సురేష్, నాగేంద్ర, దత్తు, రవికుమార్, జాబీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


సాయినాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు


శంకర్, మండల ప్రధాన కార్యదర్శి

రొద్దం: ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌టీఎఫ్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాడెశెట్టి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ టీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల గౌరవ అధ్యక్షుడిగా అంజనప్రసాద్, అధ్యక్షుడిగా సాయినాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం శంకర్, కోశాధికారిగా యోగానందరెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్‌రెడ్డి, రవీంద్ర, సరస్వతి, కార్యదర్శులుగా రామచంద్రారెడ్డి, నరసింహులు, శ్రీనివాస్‌రెడ్డి, రమణ, జిల్లా కౌన్సిలర్లుగా వి.క్రిష్టారెడ్డి, నగేష్, సురేందర్, మోహన్‌రెడ్డి, రాధిక, ఆడిట్ కన్వీనర్‌గా చంద్రశేఖరెడ్డి తదితరులకు ఏకగ్రీంవగా ఎన్నుకున్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే తిప్పేస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: టీటీడీ ద్వారా దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. ఇటీవల మండలంలోని టీడీపల్లి కొండపై వెలసిన రంగనాథస్వామి దేవాలయానికి రూ.10 లక్షలతో సీసీ రోడ్డు సౌకర్యం కల్పించారు. ఈ నేపథ్యంలో సోమవారం దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మడకశిరలో కలిసి ఘనంగా సన్మానించారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: ఆంధ్రకి జగనే మళ్లీ సీఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన లోపాలు, హామీలు విస్మరించడం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. భవిష్యత్తు తరాలకు జగనన్న నాయకత్వ అవసరాన్ని గుర్తు చేయాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి బాటలో నడవాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేకమైన సర్వేను వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ ఛైర్మన్ సునీల్, కన్వీనర్లు నాగలూరుబాబు, బోయ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బాబు అరెస్టుకు, రజక వృత్తికి సంబంధమేంటి?

చిలమత్తూరు: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల బట్టలు ఉతకరాదని టీడీపీ రజక సాధికార కమిటీ చైర్మన్ రామకృష్ణ పిలుపునివ్వడంపై వైఎస్సార్‌సీపీ రజక నాయకులు మండిపడ్డారు. రజకవృత్తికి, చంద్రబాబు అరెస్టుకు సంబంధం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రజకులు అంతా టీడీపీ వారేనని భ్రమ పడటం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ రజక మహాసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ మండిపడ్డారు. జైలులో బాబు ధోబీ సేవల్ని నిరాకరించి, బట్టలు బయటకు పంపి ఉతికించుకోవడం రజకుల్ని అవమానించడమేనన్నారు. ఇది ముమ్మాటికి కోర్టు దిక్కారణ కిందకు వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతల బట్టలు ఉతకకూడదని పిలుపునిచ్చి కులాల మధ్య చిచ్చుపెడుతున్న టీడీపీ రజక నాయకుడు రామకృష్ణపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ నిరసన

హిందూపురం టౌన్: లఖీమ్ పూర్ ఖేరీలో జరిగిన రైతుల హత్యలకు నిరసనగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బ్లాక్ డేను నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి, రైతు సంఘం కార్యదర్శి సిద్దారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వాగ్దానాలను అమలు చేయకుండా, వాటిని అమలు చేయాలని అడిగి రైతులు, కార్మికులను హత్యలు చేయిస్తోందని ఆరోపించారు.

ఎమ్మెల్యే పరామర్శ

అగళి: మండల పరిధిలోని మధుడి ఎంపీటీసీ సభ్యురాలు నిర్మలమ్మ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు సదానంద ఆరాధ్య అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి సోమవారం సదానంద స్వగృహం వెళ్లి పరామర్శించారు.